
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 జూన్ 2024



గురుకులంలో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీలు భర్తీ చేసేందుకు గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ టి.ఉమాదేవి తెలిపారు. ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ అధికారుల ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష గురువారం నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరిగినట్టు తెలిపారు. ఈ పరీక్షకు 352 మంది విద్యార్థులు రావాల్సి ఉండగా 333 మంది పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. పాఠశాలలో ఖాళీల సంఖ్యను బట్టి ఈ పరీక్షలో మెరిట్ వచ్చిన విద్యార్థులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఇదేం మద్దతు ధర

- వరికి రూ.117 మాత్రమే పెంపు
- పలు పంటలకు స్వల్పంగా పెంచిన కేంద్రం
- పెట్టుబడులకు అనుగుణంగా లేదన్న రైతులు



ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పంటలకు ఉన్న కాస్ట్ అఫ్ కల్టివేషన్ (సాగు ఖర్చు)తో పోల్చి చూస్తే రైతులలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన వంటకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో ఏడాదికేడాది పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మద్దకు ధరలు సవరించాల్సి ఉంది. రైతులు, రైతు సంఘాలు పోరాడి సాధించుకున్న ఈ హక్కుకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మొక్కుబడిగా సవరించి చేతులు దులుపుకుంటోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు కష్టించి పండించిన పంటలను దళారులు కొల్లగొడుతున్నారు. రైతులు దళారుల బారిన పడి నష్టపోరాదనే ఉద్దేశంతో ఏటా మద్దతు ధర ప్రకటించాల్సి ఉంది. 2024-25కి పండించే పంటలకు కేంద్రం మద్దతు ధరలు. తాజాగా సవరించిన ధరలు ఆసంతప్తిని మిగిల్చాయి. జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, కంది, మినుము తదితర పంటలు సాగు చేస్తారు. ఏ పంటకు చూసినా సాగు ఖర్చు భారీగా ఉంది. వ్యవసాయ యంత్రాంగం పంటల వారీగా సాగు ఖర్చు లెక్కించి హెక్టార్‌కు ఎంత ఖర్చు వస్తుంది... దిగుబడి ఎంత.. ఒక క్వింటా ఉత్పత్తికి అయ్యే ఖర్చు ఎంత అనే వివరాలను శాస్త్రీయంగా లెక్కించి పంపుతుంది. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ పరిగణలోనికి తీసుకుని మద్దతు ధరలు ప్రకటిస్తే రైతులకు కొంత మేర ఊరట కలిగే అవకాశం ఉంది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవటం శోచనీయం.

క్వింటాలుకు సవరించిన మద్దతు ధర రూపాయల్లో...

పంట పేరు	2023-24లో	2024-25లో	పెంపు
వరి ఎ-గ్రేడ్	2,203	2320	117
వరి సాధారణ రకం	2,183	2300	117
మొక్కజొన్న	2,030	2225	135
కందులు	7,200	7750	550
పెసలు	8,558	8682	124
మినుములు	6,950	7400	450
వేరుశనగ	6,377	6783	406
నువ్వులు	8,635	9267	632
సజ్జలు	2,500	2615	115
రాగులు	3,846	4290	444
పొద్దుతిరుగుడు	6,760	7280	520
సోయాబీన్	4,600	4892	292

వరికి మద్దతు ధర అంతంతే ...

జిల్లాలో వరి ప్రధాన ఆహారపు పంట. జిల్లావ్యాప్తంగా 1,94,542 ఎకరాలలో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. వరి పంట పెట్టుబడి వ్యయం ఏడాదికేడాదికి పెరుగుతోంది. కానీ మద్దతు ధరను రూ.117 మాత్రమే పెంచటంతో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. కనీస మద్దతు ధర రూ.2,000పైన పెంచి ఉంటే ధాన్యం రైతుకు కొంత మేర న్యాయం అరిగేదనే వాదన వినిపిస్తోంది. మిగిలిన పంటల పరిస్థితి కూడా ఉంది. పంటల సాగుకు ఏటా పెరుగుతున్న పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నామమాత్రపు మద్దతు ధరల పెంపుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలు సవరించలేదంటూ రైతులు, రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

పెట్టుబడి వ్యయం ఇలా...

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం వరికి కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ హెక్టారుకు రూ.1,07,896 ఉంది. కందికి రూ.50,075, పెసర రూ.70,016, మినుముకు రూ.70,016, మొక్కజొన్నకు రూ.57,949, ప్రకారం పెట్టుబడి వ్యయం ఉంటోంది. నిజానికి అన్ని వంటలపై ఇంకా పెట్టుబడి వ్యయం భారీగానే ఉంటుంది. వరిలో క్వింటా ధాన్యం పండించటానికి రూ.1,962 అవుతుంది. కేంద్రం మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2320, సాధారణ రకాలకు రూ.2,300 ప్రకటించింది. ప్రతి ఏటా రైతులు పండించిన ధాన్యానికి ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేనప్పుడు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో వరి ధాన్యం అమ్ముకుంటే హెక్టారుకు పండే క్వింటాళ్లకు రూ.1.27,600 వస్తుంది. పెట్టుబడి వ్యయం మినహాయిస్తే రైతుకు లభించే నికర ఆదాయం రూ.18,704 మాత్రమే.

అమలుకు నోని స్వామినాథన్ సిఫార్సులు

పంట ధరలను నిర్ణయించేందుకు ఏర్పాటు చేసిన స్వామినాథన్ కమిషన్ సూచించిన సిఫార్సులు నేటికీ అమలు చేయడం లేదు. వరి సాగుకు అయ్యే వ్యయంపై 30 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయించాలని స్వామినాథన్ సిఫార్సు చేశారు.

క్రమ-శిక్షణతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-నిడదవోలు

విద్యార్థులు క్రమశిక్షణ ద్వారా వారు జీవితంలో ఉన్నత దశకు చేరుకునేందుకు ఎంతో దోహదపడుతుందని పర్యాటక, సాంస్కతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ విద్యార్థులకు బ్యాగ్స్, బుక్స్, కిట్లను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తల్లితండ్రులు, ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని చిన్నతనంలో క్రమశిక్షణను అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఎంతో తోడ్పాటు ఇస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తాను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానంలో ఉండేందుకు పాఠశాల విద్య ఎంతో తోడ్పాటు నిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో లేనన్ని మౌలిక వసతులు పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తోందని, ఆ దిశగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. పాఠశాలకు స్టేజి నిర్మించిన రోటరీ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. విద్యార్థులు జీవితంలో ఎదగాలనే ఆలోచనతో స్పష్టమైన అవగాహన ఎంతో అవసరం అన్నారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా ఆత్మన్యూనతకు తావు లేకుండా సమర్ధవంతంగా ఎదుర్కోవాలన్నారు. చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులు అంతర్లీనంగా నిగూఢమైన క్రీడలు, కళల పట్ల ఆసక్తి చూపితే జీవితంలో వారి ఎదుగుదలకు ఎంతో అని చేకూర్చుతాయన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బొల్లా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్మించిన స్టేజ్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షుడు కొమ్మన వెంకటేశ్వరరావు, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్, బిఎన్‌వి.ప్రసాద్, బూరుగుపల్లి సత్యనారాయణ, హెచ్‌ఎం చెరుకూరి పద్మ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

1న పెన్షన్ పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూలై ఒకటవ తేదీన ఉదయం 5 గంటలకు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఈసారి ఇంటింటికీ ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీ ప్రక్రియ చేపట్టవలసి ఉంటుందని ఆదేశించారు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో గ్రామ స్థాయిలో అందుబాటులో ఉన్న సిఎఫ్‌ఎంఎస్ ఐడి కలిగిన ఉద్యోగి వివరాలు మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. పెన్షన్ మొత్తాన్ని జూన్ 29వ తేదీన బ్యాంకు నుంచి ఉపసంహరించనున్నట్టు తెలిపారు. పెన్షన్ పంపిణీ చేసే సమయంలో సంబంధిత లబ్ధిదారులను నుంచి రసీదు తీసుకోవాలని తెలిపారు. కనీసం ప్రతి ఉద్యోగికీ 50 మంది లబ్ధిదారుల డేటాను మ్యాపింగ్ చేస్తామని తెలిపారు. ఆధార్ బేస్డ్ విధానంలో పింఛన్లు పంపిణీ ప్రక్రియ ఉంటుందని, ఆమేరకు ఎటువంటి అలక్ష్యం వహించకుండా పెన్షన్లను పంపిణీ చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ ప్రక్రియపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక చేపటిందని తెలిపారు. బయోమెట్రిక్, ఐరిష్, ఫేస్ గుర్తింపు విధానంలో పారదర్శకంగా ఆధార్ బేస్డ్ విధానంలో పింఛన్లు పంపిణీ ప్రక్రియలో జవాబుదారీతనం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో తహశీల్దార్లు రైస్ కార్డు ఆధారంగా సమీకృత ధ్రువపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. జిల్లాలో సుమారు 1,12,869 మందికి చెందిన సమీకత ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్లను ఆయన ఆదేశించారు. ఈ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎఎన్‌వివి.ఎస్ మూర్తి, డిఆర్‌ఒ జి.నరసింహులు, డిఎల్‌డిఒలు పి.వీణాదేవి, వి.శాంతమణి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందించాలని వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఫీజుల దోపిడీలను అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు డివిఇఒ, ఆర్‌జెడికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యాసంస్థల్లో జూన్ నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు జాయిన్ అవుతున్నారని తెలిపారు. వారు చదువుకోవడానికి కావలసిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవన్నారు. మూడేళ్ల నుంచి పాఠ్య పుస్తకాలు ఇవ్వనందున ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గిపోయిందన్నారు. అధ్యాపకుల పోస్టుల్లో అనేక ఖాళీలు ఉన్నాయని తెలిపారు. తక్షణమే పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగచైతన్య, హసిఫ్, నిశ్చల్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వైసిపికి సగ్గొండ సర్పంచ్ శేఖర్‌బాబు రాజీనామా

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని సగ్గొండ గ్రామ సర్పంచ్ యండవల్లి శేఖర్ బాబు, ఆయన సతీమణి యండవల్లి కవిత వైసిపి రాజీనామా చేసినట్లు తెలిపారు. వారి రాజీనామా లేఖలను పార్టీ మండల అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజుకు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు వైసిపి పాలనను ఆమోదించలేదన్నారు. దీంతో నైతిక బాధ్యత వహించి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. పార్టీలో ఎవరితో విభేదాలు లేవని, తమ ఉన్నతకి సహకరించిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ అభివద్ధి దృష్ట్యా భవిష్యత్తు నిర్ణయం త్వరలోనే వెల్లడిస్తానని తెలిపారు.


ఉత్సవంలో పాల్గొన్న కూటమి నేతలు

కూటమి నేతల విజయోత్సవం

ప్రజాశక్తి-కడియం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా మండలంలోని వేమగిరిలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులంతా ఐకమత్యంగా ఉంటూ వేమగిరి అభివద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సూరపరెడ్డి జానకి రామయ్య, చెల్లుబోయిన శ్రీనివాస్, అల్లంపల్లి ప్రసాద్, దంగేటి సత్తిబాబు, సుంకర గోపాలకృష్ణ, కొప్పిశెట్టి రాజేష్, పరిమి రాంపండు, యనమదల రాజు, కోలా శ్రీను, గల్లా సత్తిబాబు, దంగేటి శ్రావణ్ కుమార్, కొత్తూరి కొండరాజు, ఆలపాటి సూర్యనారాయణ, దంగేటి రామ్‌ప్రసాద్, ఈడుపుగంటి హరిప్రసాద్, వాసు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, సంగిశెట్టి రాము, చింతలపూడి నాయుడు, రాయపాటి మణి, ఈతకోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'పైడిమెట్ట పథకం' అధ్యక్షునిగా రామచంద్రం

ప్రజాశక్తి-తాళ్లపూడి

పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షునిగా అన్నదేవరపేటకు చెందిన ముళ్ళపూడి రామచంద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షునితోపాటు మరో 12 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల అభివద్ధిలో కమిటీల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకష్ణ, నామన పరమేశ్వరరావు, యువగళం జిల్లా నాయకులు కాకర్ల సత్యనారాయణ, కూచిపూడి గణపతి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-నిడదవోలు, పెరవలి

ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్నీ క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులందరికీ చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర పర్యాటక సాంస్కతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల తీరుపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే విధాన నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరును తెచ్చే బాధ్యత మనపై ఉందన్నారు. అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వం అందించే విధి విధానాల ద్వారా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. అందించాలన్నారు. జులై మాసం నుండి అర్హులైన వద్ధాప్య వితంతు వికలాంగు పెన్షనర్లు అందరికీ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు జులై మాసం నుంచి రు. 4 వేలు, గత ఏప్రిల్ నుండి మూడు నెలలకూ రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.7 వేలను లబ్ధిదారులకు అందిస్తామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పెద్ద మొత్తంలో పడినప్పటికీ లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్స్ అందించడం మంచి నిర్ణయం అన్నారు. అనంతరం ఆయన వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, సంక్షేమ పథకాలు, వివిధ రకాల. పింఛన్లు అమలుపై సమీక్షించారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ కమిషనర్, టి.రామ్‌భూపాల్ రెడ్డి, టిడ్కో ఎస్‌ఇ బి.శ్రీనివాసరావు, తహశీల్దారు వి.నాగభూషణం, ఎంపిడిఒ జెవి ఝాన్సీ, ఇఇ పరుశురాం వివి ధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించవలసిన బాధ్యత ఉద్యోగులకు ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు.


పెరవలిలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. గత ప్రభుత్వం జల జీవన్ గ్రాంట్ రూ.200 కోట్లు ఇతర పథకాలకు మళ్ళించిందన్నారు. గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని మంత్రి కృష్టికి తీసుకురాగా దీనిపై క్యాబినెట్లో చర్చించామని ఆయన తెలిపారు. ప్రాథమిక పాఠశాలలు హైస్కూల్లో కలపడం వల్ల విద్యా వ్యవస్థ దెబ్బతిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు, బూరుగుపల్లి శ్రీనివాస్, రవివర్మ, అతికాల శ్రీను, పిప్పర రవికుమార్, తహశీల్దారు సుధ, ఎంపిడిఒ హిమ మహేశ్వరి పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడమే ధ్యేయం


ప్రజాశక్తి - సీతానగరం

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో అధిక మెజార్టీతో గెలిపించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ఎంఎల్‌ఎ ప్రజలను మభ్య పెట్టారే తప్ప ప్రజలకు ఏ పనీ పూర్తిగా చేయలేదన్నారు. రహదారి పనులు ఎక్కడికక్కడే మిగిలి ఉన్నాయన్నారు. పైపై మెరుగులు దిద్ది సీతానగరం రహదారి పనులు తామే పూర్తి చేసామని హడావిడి చేశారని ఆరోపించారు. రైతులకు ధాన్యం బిల్లులు నేటికీ రాలేదన్నారు. తొర్రిగడ్డ, పురుషోత్తపట్నం పంపింగ్ స్కీములను పూర్తిగా మరమ్మతులు చేసి రైతులకు సకాలంలో నీరు అందిస్తామని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బలరామకృష్ణ

కార్టూ'నిజం'




సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్ బాబు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు గురువారం చెడు, మంచి స్పర్శ, విద్యా హక్కు చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు శ్రద్ధగా చదవుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు, పాఠ్యపుస్తకాలతో పాటు దిన పత్రికలు కూడా చదవాలని, పాఠశాలలో ఉన్న గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని, తద్వారా పోటీ పరీక్షల్లో మంచి విజయం సాధించవచ్చన్నారు. విద్యార్తుల్లో దేశ భక్తి, సోదర భావం పెంపొందించేలా చర్యలు తెసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లలిత కుమారి, డిసిపిఒ రాజ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అందరి ఆదరాభినాలతోనే విజయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగర ప్రజలంతా తన కుటుంబ సభ్యులని, కూటమి నాయకులు, కార్యకర్తల ఆదరాభిమానాలతోనే ఎన్నికల్లో తాను ఘన విజయం సాధించానని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. జెఎన్ రోడ్డులోని చెరుకూరి కన్వెన్షన్ హాల్లో గురువారం ఎన్‌డిఎ కూటమి ఆత్మీయ సమావేశం టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్.జగన్ పాలనలో ఐదేళ్ల పాటు చాలా ఇబ్బందులు పడ్డామని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని చెప్పారు. అధికార దురంహంకారంతో తనకు అసలు టిక్కెట్టే రాదని, తనను రాజకీయాల్లో లేకుండా చేస్తామన్న ఒక వ్యక్తి ఇప్పుడు అసలు కనిపించకుండానే పోయాడన్నారు. నగరంలో ఐదేళ్ల పాటు పారిశుధ్యాన్ని పక్కన పెట్టేశారని, అధికార దుర్వినియోగం చేస్తూ అనాలోచితంగా చేసిన పనుల కారణంగా ప్రజలు నానా అవస్థలూ పడుతున్నారని, వాటన్నింటినీ సరి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. స్థానిక కూటమి నాయకులతో కలిసి పని చేయాలని అధికారులకు సూచించామన్నారు. మాట వినని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఆయా డివిజన్లలో పరిశీలించిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను నార తీస్తామని హెచ్చరించారు. ఇక్కడ ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి ఆవ భూములు, నగరంలో చేపట్టిన వివిధ పనుల్లో ఎంత అవినీతికి పాల్పడ్డాడో అన్ని ఆధారాలతో బయటపెడతామన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని, కూటమి నాయకులతో కలిసి ప్రజలకు మంచి చేస్తామన్నారు. మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించేందుకు పని చేసిన ఎవరినీ మర్చిపోమన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ కూటమి ఐక్యంగా కలవడం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాలరాయుడు, జనసేన పార్టీ రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, ఆర్యాపురం బ్యాంక్ మాజీ చైర్మన్ చల్లా శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, దొండపాటి సత్యంబాబు, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, వై.శ్రీను, జామి సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, యనమల రంగబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు


చెక్కు అందిస్తున్న ఆర్‌జెడి ఎ.సత్యనారాయణ

స్కూల్ ఫీజు కోసం రూ.10 వేల సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్కూలు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి స్వర్ణాంధ్ర సంస్థ రూ.పది వేల సాయం అందించడం అభినందనీయమని మున్సిపల్ పరిపాలన శాఖ పూర్వపు ఆర్‌జెడి ఎ.సత్యనారాయణ అన్నారు. గురువారం స్వర్ణాంధ్ర సేవా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణ ఫీజు నిమిత్తం నగదు అందించారు. పేదరికంలో ఉన్న విద్యార్థులను ఆదుకోవడంలో స్వర్ణాంధ్ర గతంలోనూ అనేక మందికి సాయం అందించిన సంగతి సత్యనారాయణ గుర్తు చేశారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ రాజమహేంద్రవరం కేంద్రంగా ఉచిత అన్నదానం, వృద్ధాశ్రమం, మహిళలు, మగ్గంలో శిక్షణలతో పాటు, వీధి వ్యాపారులకు గొడుగులు అందించడం హర్షణీయమన్నారు. దాతల సహకారంతో స్వర్ణాంధ్ర 26 ఏళ్లుగా నడపడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్, డాక్టర్ గుబ్బల రాంబాబు శ్రీను పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



లారీ టైరు కింద నలిగిపోయిన మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. పోలీసులు వివరాల ప్రకారం..ప్రకాశం జిల్లా కంభం మండలం లింగపల్లి గ్రామానికి చెందిన చంద్రపాటి లావరాజు(44) మండలంలోని మల్లేపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం మోటార్ సైకిల్‌పై పామాయిల్ గెలల కోసేందుకు లింగపల్లి వెళ్లి పని ముగించుకుని తిరిగి మల్లేపల్లి వస్తుండగా నీలాద్రి రావు పేట సమీపంలో వెనక నుండి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

బస్సు, వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

ఆర్‌టిసి బస్సు, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యాన్‌లోని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నల్లజర్లలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లజర్ల శివారు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఏలూరు నుండి రాజమండ్రి వెళుతున్న ఆర్‌టిసి బస్సును నల్లజర్ల వైపు నుండి ఏలూరు జిల్లా గాలాయగూడెంకు వెళుతున్న బొలేరో వ్యాన్ రాంగ్ రూట్లో బస్సుకు ఎదురుగా వచ్చి ఢీకొంది. అనంతరం పక్కన ఉన్న రేకుల షెడ్డు ఢీకొని పంట కాలవలోకి వెళ్ళింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 55 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ప్రయాణికులను వేరే బస్సుల్లో తరలించారు. ఈ క్రమంలో బస్సులో ముందు సీట్లో కూర్చున్న మహిళకు కాలు బెణకడంతో స్థానిక పిహెచ్సి నందు ఫస్ట్ ఎయిడ్ అనంతరం ఆమెను పంపించి వేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాన్లోని వ్యక్తులను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మొక్కులు తీర్చుకున్న నెహ్రూ అభిమానులు

ప్రజాశక్తి-గోకవరం

ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు భారీ విజయం దక్కడంతో జగ్గంపేట నియోజకవర్గంలో ఊరూరా నెహ్రూ అభిమానులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇందులో భాగంగా నెహ్రూ అనుచరుడు టిడిపి గోకవరం మండలం తంటికొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగం వెంకటపతి శ్రీవారి మెట్ల మార్గం ద్వారా 2,388 మెట్లు కాలినడక ఎక్కి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుమార్తె వివాహానికి నవీన్

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పాలాడి శ్రీనివాస్ కుమార్తె వివాహానపికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ హాజరయ్యారు. గురువారం గోకవరంలో స్థానిక సూర్య ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని వధూవరులు ఆషిక జోషి, వీర ప్రభువులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

90 రోజుల విద్యా ప్రణాళికపై దృష్టి

ప్రజాశక్తి - సామర్లకోట

పాఠశాలల్లో 90 రోజుల విద్యా ప్రణాళికను విధిగా ఉపాధ్యాయులు పాటించాలని ఎంఇఒ-1 వై.శివ రామకృష్ణయ్య అన్నారు. గురువారం మండలం లోని పనసపాడు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, పరిసరాల శుభ్రత, మంచినీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. భాషా నైపుణ్యాలు, చతుర్విధ ప్రక్రియలు ఎలా ఉన్నాయనే విషయంపై, వర్క్‌బుక్, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఉదయం విశ్రాంతి సమయంలో విద్యార్థులకు పోషకా హారంగా ఇచ్చే వేరుశనగ చిక్కీ, రాగిజావలపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం రుచిచూశారు. ప్రస్తుతం జరుగుతున్న అడ్మిషన్ నమోదు, డ్రైవ్ వేగవంతం చేసి 90 రోజుల విద్యా ప్రణాళిక అమలును పరిశీలించారు. బడి ఈడు పిల్లలను బడిలో నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల స్థాయిని తెలుసుకుంటున్న ఎంఇఒ

1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జులై 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డిఆర్‌డిఎ, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. జులై నెలలో చేపట్టబోయే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ ప్రణాళిక, చంద్రన్న బీమా క్లెయిమ్స్ పరిష్కారం, స్త్రీ నిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసిన రుణాలు వివరాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి నిమిత్తం కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను రానున్న జూలై నెల నుంచి ఎన్‌టిఆర్ భరోసా పేరుతో పంపిణీ చేపట్టనున్నదన్నారు. జూన్ నెలలో సామాజిక భద్రత పింఛన్ల కింద జిల్లాలో 2,79,805 మందికి రూ.82.90 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జులై నెలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్‌టిఆర్ భరోసా పేరుతో 17 రకాల పింఛన్లు జిల్లాలో 2,79,319 మందికి రూ188.40 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మూడు వేలు, నూతనంగా పెంచిన పింఛన్ సొమ్ము రూ.4 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూలై 1న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్ సొమ్ము సకాలంలో పంపిణీ చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకు కిందిస్థాయి సిబ్బందికి స్పష్టమైన సూచనలు తెలియజేసి, సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో 39,532 స్వయం సహాయక సంఘాల్లో 4.08 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని ఆయన తెలిపారు. వారికి మంజూరు చేసే స్త్రీనిధి, ఉన్నతి, సున్నా వడ్డీ కింద మంజూరు చేసే రుణాలు, రికవరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు స్వయం ఉపాధి మార్గాలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, డిపిఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



'డయేరియా వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు'

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో డయేరియా వ్యాధి పట్ల ప్రజలెవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, డయేరియా నియంత్రణకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సగిలి షాన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలతోపాటు వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంచి నీరు ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. తాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, తాగునీరు పైపులైన్ల తనిఖీ, లీకేజీలు, మరమ్మతుల పనులు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం రోజుకు రెండుసార్లు చొప్పున సాగుతున్నాయని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఐరన్ టాబ్లెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఇంటింటికి సర్వే నిర్వహించి ఎవరికైనా వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటే వారిని గుర్తించి వారికి మందులు అందించడం జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల డయేరియా అనుమానం కేసులను ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని, వారికి ఎటువంటి ప్రమాదం లేదని, ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే వారిని ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని వివరించారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన వేడి నీళ్లు మాత్రమే తీసుకోవాలని, ఇంటిలోనూ, పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవడం తోపాటు, మంచినీటి నిల్వచేసే బిందులు, డ్రమ్ములను కూడా శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎపి రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జగ్గంపేటలో సుమారు 2వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారని, అయితే ఇదే గ్రామంలో 500 మంది వరకూ ఇళ్లు లేని పేదలు ఉన్నారన్నారు. కావున తక్షణమే జగ్గంపేట గ్రామంలో జగనన్న కాలనీ ఆనుకుని ఉన్న స్థలాన్ని వీరికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కడితి సతీష్, కె.రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, ఎల్లే సత్తిబాబు,నాగమణి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లైన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హెలెన్ కిల్లర్ 144వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వాసవి ఉమెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ సర్వలక్ష్మి పాల్గొని మాట్లాడారు. హెలెన్ కిల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బి.కాశీఅన్నపూర్ణ, ట్రెజరర్ పి.సరస్వతి, సభ్యులు బి.శీతల్, మహాలక్ష్మి, సిహెచ్.నాగలక్ష్మి, బి.తోషిత, కె.వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, సుధాకర్, ఎం.సుశీల, కె.మహేశ్వరి, డి.వీరవేణి పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగ ఉండాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత పిలుపునిచ్చారు. గురువారం కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం తరలింపుపై నిర్వహించిన వ్యాసరచనలో విజేతలకు బహుమతులు ప్రధానం కార్యక్రమం జరిగింది. మొదటి బహుమతి పి.రాజ్‌కుమార్, రెండో బహుమతి యు. సుసన్నారాణి, మూడో బహుమతి యు.మహేష్ గెలుపొందినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, శ్రీలక్ష్మి, సురేష్, శివప్రసాద్, మదీనా, బంగార్రాజు, పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మనోవేదనకు చికిత్స అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రకృతి వైపరీత్యాలు, కారు ప్రమాదాలు, లైంగిక వేధింపుల వంటి ప్రాణాంతక సంఘటనల అనుభవాలు తర్వాత వచ్చే మనోవేదనను చికిత్స ద్వారా నయం చేయవచ్చని డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురువారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మనోవేదన నివారణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్టకరమైన సంఘటనలకు సంబంధించి జ్ఞాపకాలు చాలా కాలం వరకు వెంటాడుతాయని అన్నారు. అటువంటివారు నిస్పృహకు లోన వ్వడం, ఆందోళన చెందడం, మత్తు పదార్థాలకు అలవాటు పడతారని అన్నారు. వీరికి మందుల ద్వారా చికిత్స అందిస్తే కొద్ది ఆలస్యమైనా తేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సదస్సులో అడబాల రత్నప్రసాద్, రాజా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

తిమ్మాపురంలో నేను బడికి పోతా...

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో నే బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు అందరిని బడిలో చేర్చాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీజనల్, అతిసార వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో 10 మంది అంగన్‌వాడీ బాలలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం ప్రభాకర్‌వర్మ, ఎఎన్ఎం పి.నాగమణి, మహిళా పోలీసు లీలారాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ పరంజ్యోతి, అంగన్‌వాడీ వర్కర్స్ యేసు రత్నకుమారి, సత్యవతి, సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా బొజ్జా తారకం జయంతి

ప్రజాశక్తి-కడియం

పొట్టిలంకలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం బొజ్జా తారకం జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ కోణాల లాజరు కేక్ కట్ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్న రాజు మాట్లాడుతూ బొజ్జతారకం హైకోర్టులో న్యాయవాదిగా దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఉద్యమాలకు న్యాయకత్వం వహించారని, కోర్టుల్లో న్యాయపోరాటం చేసేవారని తెలిపారు. కారంచేడు నరమేధం తర్వాత హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది పదవికి రాజీనామా చేసి దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా చంటి బాబు, అంబటి రాజారత్నం, రేముల్లా ఏసు, కొల్లపు వీరన్న, బెల్లామను శివాజీ, మొఘలపు రాజు, గుర్రం రాజు, గుమ్మడి అర్జున్, జక్కల నాని, బడుగు వెంకీ, యాళ్ల సురేష్, దాసి సంతోష్, నెల్లి నవీన్, పల్లి భీమరాజు, బడుగు యోహాను, తదితరులు పాల్గొన్నారు.



తారకంకు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

బాధితులకు మానవ హక్కుల సంఘం పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అతిసారా వ్యాధి లక్షణాలతో చికిత్స పొందుతున్న రోగులను జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ గురువారం పరామర్శించారు. వాంతులు, విరోచనాలతో బ్రౌన్‌పేట, కుమ్మరివీధి ప్రాంతాలకు చెందిన పలువురు చికిత్స పొందుతుండగా వారి యోగ క్షేమాలను అప్పలకొండ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ పి.అమలను కలిసి పట్టణంలో అతిసార పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కొత్తకేసులు నమోదు కాలేదని డాక్టర్ అమల చెప్పారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు ఎస్.రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న అప్పలకొండ

తిరుపతిలో పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. చెత్త పోగులను తొలగించటం, మురుగు కాలువల్లో పూడిక తొలగింపు, మంచినీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

నర్సరీల్లో అపారమైన వృక్ష సంపద

కడియం : అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కడియం నర్సరీల్లో అపారమైన వృక్ష సంపద పరిరక్షణలో రైతుల కృషి అభినందనీయమని హైదరాబాద్ ఎటిఎఆర్ఐ డైరెక్టర్లు డాక్టర్ షేక్ ఎన్.మీరా, డాక్టర్ ఆర్‌కె.మాధుర్ అన్నారు. 72 మంది కృషి విజ్ఞాన కేంద్రాల సీనియర్ శాస్త్రవేత్తల బృందం కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీలోని స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఉద్యానవన మొక్కలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాధూర్, షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ దేశ, విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ఏకైక ప్రదేశం కడియం ప్రాంతమని చెప్పారు. రాబోయే రోజుల్లో నర్సరీలు ఒక ఉద్యానవన హబ్‌గా మారగలవని అన్నారు. ఈ నర్సరీలలో ఉన్న కొన్ని వేల రకాల మొక్కజాతులు వాటి శాస్త్రీయ నామాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చునన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో గురుకులాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఓసి సామాజికవర్గాల్లోని పేద పిల్లల కోసం ప్రతీ నియోజకవర్గానికి ఒక గురుకులం పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం ఓ ప్రకటనలో కోరారు. గత టిడిపి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక నూతన గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా ఆర్డినెన్స్ జారీ చేసిందని, అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసిందన్నారు. తిరిగి టిడిపి అధికారంలోకి రావడంతో ప్రతి నియోజకవర్గంలో బాల బాలికలకు నూతన గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

'తాగునీటి పరీక్షలు నిర్వహించాలి'

ప్రజాశక్తి - కాకినాడ

గ్రామాలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా అతిసార వ్యాధి ప్రబలుతుందని, కావున తక్షణమే తాగునీటిని ఆయా ప్రాంతాల వారీగా పరీక్షించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. పలు ప్రాంతాల్లో 40 శాతం కుళాయి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉన్నాయన్నారు. అత్యధిక ప్రాంతాల్లో 25శాతం లీకేజీలు ఉన్నాయని అన్నారు. అందుకే తాగునీరు లేత ఆకుపచ్చ రంగులోకి మారిపోతుందన్నారు. ఆ నీటినే ప్రజలు తాగుతున్నారని అన్నారు. కావున తక్షణమే తాగునీటి పరీక్షలతోపాటు, నీటి సరఫరా పైపులైన్‌లను మార్పు చేయాలని ఆయన కోరారు.

మహిళలకు పని ప్రదేశంలో భద్రత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా, మహిళల రక్షణ కమిటీ' ఏర్పాటు చేసి నివేదిక అందచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. గురువారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి, డిఆర్ఒ జి.నరసింహులుతో కూడిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ, పని చేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపుల ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ '14, 15 హెచ్ ప్రకారం లింగ సమానత్వం కోసం స్త్రీ ప్రాథమిక హక్కు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవంగా జీవించే, జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు లేదా లైంగిక వేధింపులకు గురికాకుండా సురక్షితమైన వాతావరణానికి హక్కును కలిగి ఉన్నారన్నారు. అందులో భాగంగా మహిళలు స్వేచ్ఛగా భద్రతా కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం లేదా వ్యాపారాన్ని నిర్వహించడానికి అనువైన వాతావరణం కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. దీనిలో భాగంగా ఆయా పనిచేసే ప్రదేశాల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ అన్ని పరిపాలనా కేంద్రాల్లో లేదా కార్యాలయాల్లో తక్షణం ఏర్పాటు చేస్తూ, వారి వివరాలతో కూడిన నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పీడీ కె.విజయ కుమారి మాట్లాడుతూ, మహిళలకు పని చేసే ప్రదేశంలో భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్ భరత్